క్లుప్తంగా

గ్రంథాలయాల్లో విజ్ఞాన సంపద

కనిగిరి రూరల్: గ్రంథాలయాల్లో విద్యార్థులు పుస్తకాలు చదవడం వల్ల విజ్ఞాన సంపద, మేధాశక్తి పెరుగుతుందని హెచ్‌ఎం కేవీ శర్మ అన్నారు. పట్టణంలోని చింతలపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం నూతన లైబ్రరీని ప్రారంభించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రామశర్మ, ఉపాధ్యాయుడు కేవీలు మాట్లాడుతూ గ్రంథాలయాల ఏర్పాటు విద్యార్థులకు ఎంతో దోహదపడుతుందన్నారు. పాఠ్యపుస్తకాలు చదవడం వల్ల జ్ఞానశక్తి పెరుగుతుందని తెలపారు. గ్రంథాలయంలో సుమారు 1500 రకాల పాఠ్యపుస్తకాలు విద్యార్థులకు అందుబాటులో ఉంచామని తెలిపారు. ఉపాధ్యాయులు కె.వెంకటేశ్వర్లు, డి.శ్రీనివాసరావు, మాలకొండయ్య, కేవీ రత్నకుమారి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

16 నుంచి రెవెన్యూ సదస్సులు

హనుమంతునిపాడు: మండలంలో ఈ నెల 16 నుంచి సెప్టెంబర్ 30 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ బీ.దిలీప్‌కుమార్ తెలిపారు. సదస్సులు రెవెన్యూ క్లస్టర్ గ్రామాల్లో జరుగుతాయన్నారు. సదస్సులకు తహసీల్దార్, మండల సర్వేయర్, వీఆర్వోలు, వీఆర్ఏలు, దేవదాయ శాఖ, వక్ఫ్ బోర్డు వారు హాజరవుతారన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భూ సమస్యలు గుర్తించాలి



రెవెన్యూ సదస్సుపై అవగాహన కల్పిస్తున్న తహశీల్దార్ ఉషా

పీసీపల్లి: భూ సమస్యలను గుర్తించాలని తహసీల్దార్ ఉషా అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 16 నుంచి సెప్టెంబర్ 30 వరకు జరగనున్న రెవెన్యూ సదస్సుకు సంబంధించిన సమస్యలను ముందుగానే గుర్తించి పరిష్కార మార్గాలు చూపాలన్నారు. గ్రామస్థాయి నుంచి సమస్యలు పరిష్కార దిశగా రెవెన్యూ సిబ్బంది చొరవ చూపాలన్నారు. గ్రామస్థాయిలో పరిష్కారం కానీ సమస్యలు రెవెన్యూ సదస్సులో పరిష్కరించేందుకు వీలుంటుందన్నారు. సర్వేయర్లు, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సమస్య పరిష్కారానికి కృషి



వినియోగదారులతో మాట్లాడుతున్న విద్యుత్ అధికారులు

కొండపి(సింగరాయకొండ): విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరించడమే విద్యుత్ అదాలత్ ముఖ్య ఉద్దేశమని సీజీఆర్ఎఫ్ చైర్మన్ ఎన్.విక్టర్ ఇమ్మానుయేల్ పేర్కొన్నారు. మంగళవారం కొండపిలోని గుడిపల్లి చందు కళ్యాణ మండపంలో విద్యుత్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలే క్షేత్ర స్థాయిలో పరిష్కారం కాకుంటే కన్జ్యూమర్ గ్రీవెన్స్ సెల్‌కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. విద్యుత్ పంపిణీ వ్యవస్థలో ఎదురయ్యే సేవా లోపాలను సత్వరం పరిష్కరించి, వేగంగా న్యాయం చేకూర్చేందుకు విద్యుత్ చట్టం 2003 దోహదపడుతుందన్నారు. అదాలత్‌లో పది మండలాలకు సంబంధించి 13 అర్జీలు వచ్చాయని ఏఈ కుంచాల కోటయ్య తెలిపారు. బిల్లింగ్ సమస్యలపై వచ్చిన ఆరు అర్జీలను వెంటనే పరిష్కరించామన్నారు. విద్యుత్ లైన్లకు సంబంధించిన ఏడు అర్జీలను త్వరలోనే పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సాంకేతిక సభ్యుడు వెంకటకృష్ణ, ఆర్థిక సభ్యుడు శ్రీనివాసరావు, స్వతంత్ర సభ్యురాలు సునీత, ఎస్ఈ కేవీజీ సత్యనారాయణ, జిల్లా సాంకేతిక ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ హైమవతి, కందుకూరు డీఈ వీరయ్య, జిల్లా అకౌంట్స్ అధికారి సుబ్బారావు, సింగరాయకొండ సబ్ డివిజన్ అధికారి యుగంధర్, కందుకూరు డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

త్వరలో సొసైటీ బ్యాంకుల కంప్యూటరీకరణ



బ్యాంకులో రికార్డులు పరిశీలిస్తున్న జేసీ గోపాలకృష్ణ

టంగుటూరు: సొసైటీ బ్యాంకుల్లో రికార్డులు కంప్యూటరీకరించి అవినీతిని నిర్మూలించేందుకు చర్యలు చేపట్టినట్లు జేసీ గోపాలకృష్ణ పేర్కొన్నారు. టంగుటూరులోని పీడీసీసీ బ్యాంకును జేసీ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి, రైతులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా సొసైటీ బ్యాంకుల కంప్యూటీకరణ ప్రారంభించనున్నట్లు చెప్పారు. సేవల తీరుపై ఖాతాదారులతో మాట్లాడారు. బ్యాంకు సిబ్బందికి సూచనలిచ్చారు.

లక్షలు ఖర్చు చేసినా..

లక్ష్యం నీరుగారే..!

కనిగిరి రూరల్: ఏ వీధి చూసిన ఏముంది గర్వకారణం.. అధ్వాన్న పారిశుధ్యం.. కాలువల్లో కదలని మురుగు.. దోమల ఉత్పత్తి కేంద్రాలు.. వెరిసి రోగాల బారిన పట్టణ ప్రజలు. కనిగిరి మున్సిపాలిటీలో 20 వార్డులు ఉన్నాయి. కొన్ని వార్డుల్లో సీసీ డ్రైన్లు నిర్మాణం జరగలేదు. కొన్ని చోట్ల ఏర్పాటు చేసిన కచ్చా డ్రైన్లు నిర్వహణ, ప్రణాళిక లేక పూడిపోయి రోడ్ల పైనే మురికి నీరు ప్రవహిస్తున్నాయి. కొన్ని రోజులుగా పట్టణంలో రూ.33 లక్షలతో పూడికతీత పనులు ప్రారంభించారు. పెద్ద డ్రేనేజీ కాలువల్లో పూడిక తీత పనులు చేపట్టిన మున్సిపల్ అధికారులు తీసిన చెత్త, చెదారం ఇతర వ్యర్థాలను ట్రాక్టర్లను పెట్టి అక్కడి నుంచి బయటకు తొలగించలేదు. ఫలితంగా ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఆ వ్యర్థాలు తిరిగి కాలువల్లోకే జారి పడుతున్నాయి. ఫలితంగా రూ.లక్షల ఖర్చుతో చేపడుతున్న లక్ష్యం.. లక్ష్యం నీరుగారుతుందనే విమర్శలున్నాయి. అంతేగాక నిత్యం ప్రజలతో రద్దీగా ఉంటే ప్రభుత్వ కార్యాలయాల సముదాయ ప్రాంగణాలు సైతం అధ్వాన్న పారిశుధ్యాలకు నిలయంగా మారాయి. విలీన గ్రామాల్లో, శివారు ప్రాంతాల్లో పారిశుధ్యం పనులు తూతూ మంత్రమే. ఎక్కడ చూసినా మురుగు నీటి నిల్వలతో దర్శనమిస్తున్నాయి. ఓ వైపు కుక్కలు.. మరో వైపు పందులు, ఇంకో వైపు దోమలు పట్టణంలో స్వైర విహారం చేస్తుండటంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. దోమల వ్యాప్తి నివారణకు చేస్తున్న ఫాగింగ్ పనులు ప్రధానం పట్టణం తప్ప వార్డులోని శివారు ప్రాంతాల్లో జరగడం లేదని విమర్శలున్నాయి. పట్టణంలోని అన్ని వార్డుల్లో ప్రణాళికా బద్ధంగా ఫాగింగ్ చేయకుండా మమ అనిపిస్తున్నారనే ఆరోపణలున్నాయి. జనావాసాల మధ్యనే మురికినీరు నిల్వ, అధ్వాన్న పారిశుధ్యం... చెత్త చెదారంతో నిండుకుని ఉండటంతో పందులు స్వైర్వవిహారం చేస్తున్నాయి. కాలువల్లో మురికినీరు రోడ్లపైకి వచ్చి దోమల ఆవాస కేంద్రాలుగా మారాయి. ఫలితంగా పట్టణ ప్రజల దోమ కాటుకు గురై వ్యాధుల బారిన పడుతున్నారు.



వాటర్ ఎయిర్ వాల్ వద్ద అధ్వాన్న పారిశుధ్యం



జనవాసాల మధ్య పందుల స్వైర విహారం



పూడికతీత చేశాక.. వ్యర్థాలు తొలగించకపోవడంతో తిరిగి కాలువల్లో పడిన దృశ్యం

విద్యుత్ శాఖాధికారుల తనిఖీలు

- రూ.1.31 లక్షల అపరాధ రుసుం వసూలు



వివరాలు వెల్లడిస్తున్న డీఈ

హనుమంతునిపాడు: మండలంలోని తిమ్మారెడ్డిపల్లి, నందనవనం, సీతారాంపురం, గాయంవారిపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో మంగళవారం విద్యుత్ శాఖాధికారులు దాడులు నిర్వహించారు. కనిగిరి డివిజన్ విద్యుత్ శాఖ ఈఈ ఎం హరిబాబు ఆధ్వర్యంలో విజిలెన్స్ అధికారి ఆర్ శ్రీనివాసరావు పర్యవేక్షణలో 28 బృందాలు దాడులు నిర్వహించారు. దాడిలో 1180 సర్వీసులను తనిఖీ చేసి అదనపు లోడు వాడుతున్న 24 సర్వీసులను, 3 దొంగ సర్వీసులను గుర్తించారు. వారికి మొత్తం రూ.1.31 లక్షల జరిమానా విధించారు. దాడుల్లో విద్యుత్ అధికారులు ఎం.హరిబాబు, శ్రీనివాసరావు, టి. శ్రీకాంత్, జేఈ మణికంఠ, సిబ్బంది పాల్గొన్నారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై దాడి



ఆస్పత్రిలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ చెన్నకేశవులు

కనిగిరి రూరల్: తన జీవనాధారమైన బంకు తొలగించాడనే ఆవేదనతో శానిటరీ ఇన్‌స్పెక్టర్ చెన్నకేశవులపై చిరువ్యాపారి లింగాల కేశవాచారి దాడి చేసి గాయపరిచాడు. పోలీసుల కథనం ప్రకారం ...లింగాల కేశవచారి పట్టణంలోని చెప్పల్ బజార్ రోడ్డులో వాచ్ మెకానిక్ బంకు పెట్టుకొని జీవనం సాగిస్తున్నాడు. గత నెల 3వ తేదిన మున్సిపల్ అధికారులు చెప్పల్ బజార్‌లోని ప్లాట్ ఫాంపై ఉన్న బంకులు తొలగించారు. అందులో భాగంగా ఆచారి బంకు కూడా తొలగించడంతో జీవన భృతి కోల్పోయి తీవ్ర ఆవేదనతో ఉన్నాడు. ఈ క్రమంలో మంగళవారం చెప్పల్ బజార్ వైపుగా వెళ్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ చెన్నకేశవులు, లింగాల ఆచారి మధ్య గొడవ జరిగింది. ఘర్షణలో కేశవచారి అతని దగ్గర ఉన్న దబ్బళం లాంటి వస్తువుతో కడుపులో, చేతిపై గాయపరిచాడు. అడ్డుకోబోయిన పారిశుధ్య కార్మికుడికి గాయపరిచాడు. తీవ్ర గాయాలైన శానిటరీ ఇన్‌స్పెక్టర్ చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రిలో చేరారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై టి.త్యాగరాజు తెలిపారు. ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న చెన్నకేశవులను మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ పరామర్శించారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి



టోల్‌ప్లాజా వద్ద వాహన తనిఖీలు చేస్తున్న సీఐ హజరత్తయ్య

టంగుటూరు: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని సింగరాయకొండ సీఐ హజరత్తయ్య అన్నారు. స్థానిక టోల్ ప్లాజా వద్ద మంగళవారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు..నిబంధనల మేరకు నంబర్ బోర్డులను అమర్చుకోవాలని, లేకుంటే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనదారులు హెల్మెట్లు ధరించి పరిమితమైన వేగంతో వెళ్లాలని, రహదారి భద్రత సూత్రాలు పాటిస్తూ క్షేమంగా గమ్యాన్ని చేరుకోవాలన్నారు. ఆయన వెంట టంగుటూరు, సింగరాయకొండ ఎస్సైలు పున్నారావు, శ్రీరాం, సిబ్బంది పాల్గొన్నారు.

దేవదాయ భూముల వేలం..

చెన్నకేశవుడికి రూ.40.06 లక్షల ఆదాయం



భూముల వేలం నిర్వహిస్తున్న అధికారులు



వేలంలో పాల్గొన్న రైతులు

జరుగుమల్లి(సింగరాయకొండ): జరుగుమల్లి మండలం దావగూడూరు పంచాయతీలోని చెన్నకేశవ స్వామి దేవస్థానం భూముల లీజు వేలం ద్వారా రూ.40,06,400 ఆదాయం సమకూరినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి రజిని తెలిపారు. ఆలయానికి సంబంధించి 294.44 ఎకరాల భూములు ఉండగా గత నెల 31వ తేదీ వేలంలో 20.46 ఎకరాలకు రూ.4,23,500 ఆదాయం, సోమవారం 273.98 ఎకరాలకు వేలం నిర్వహించగా రూ.35,82,900 ఆదాయం వచ్చిందని ఈఓ వివరించారు. ఒక ఏడాది కౌలు పద్ధతిలో నిర్వహించిన వేలంలో గ్రామంలోని రైతులందరూ పాల్గొన్నారని చెప్పారు. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సత్యన్నారాయణ వేలాన్ని పర్యవేక్షించారు.పోలీసులబందోబస్తుమధ్య వేలం కొనసాగింది.

అన్య పదార్థాలు లేకుండా చూసుకోవాలి



రైతులకు సూచనలిస్తున్న వేలం నిర్వహణాధికారి సునీల్‌కుమార్

కొండపి (సింగరాయకొండ): పొగాకు గ్రేడింగ్‌లో అన్య పదార్థాలు లేకుండా చూసుకోవాలని వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్ అన్నారు. స్థానిక పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం రైతులకు సలహాలు సూచనలు చేశారు. అనంతరం నిర్వహించిన వేలంలో ధర్మవరం, కోయవారిపాలెం, వెంకట కృష్ణాపురం ముక్కోడిపాలెం, తాటాకులపాలెం గ్రామాలకు చెందిన రైతులు 1158 బేళ్లను వేలానికి తీసుకురాగా 915 బేళ్లను కొనుగోలు చేసి 243 బేళ్లను తిరస్కరించారు. గరిష్ఠ ధర రూ.358, కనిష్ఠ ధర రూ. 204, సరాసరి రూ.296.52 నమోదైంది. వేలంలో 15 మంది వ్యాపారులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి గేదె మృతి



విద్యుత్ షాక్‌తో మృతి చెందిన గేదె

కనిగిరి రూరల్: విద్యుదాఘాతానికి గేదె మృతి చెందింది. ఈ సంఘటన పట్టణంలోని కొత్తూరు సమీపంలో జరిగింది. వివరాల్లోకి వెళితే..కొత్తూరు- కలగట్ల రహదారి పక్కనే తక్కువ ఎత్తులో విద్యుత్ ట్రాన్స్‌ఫారం ఉంది. దానికి ఎటువంటి కంచె ఏర్పాటు చేయలేదు. కొత్తూరులోని లక్ష్మీరెడ్డికి చెందిన గేదె ఉదయాన్నే మేతకు వెళ్లి తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ తగిని అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ రూ.70 వేలు ఉంటుందని వాపోయాడు.

ఎంపీడీఓగా సురేష్ బాధ్యతల స్వీకరణ

పామూరు: ఎంపీడీఓగా బొల్లినేని సురేష్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. పల్నాడుజిల్లా మాచవరం ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న ఆయన బదిలీల్లో భాగంగా పామూరు ఎంపీడీఓ బదిలీపై వచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిషత్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, అధికారులు, ప్రజాప్రతినిధులు అందరినీ సమన్వయం చేసుకుని అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాలు అందేలా చూస్తానన్నారు. మండల అభివృద్ధికి ప్రజలు సహకరించాలన్నారు.

దేవస్థాన భూములను ఆన్‌లైన్ చేయాలి

పామూరు: పామూరులో పలు ఆలయాలకు చెందిన భూములు అన్యాక్రాంతమవుతున్నాయని, వాటిని ఆక్రమణదారుల నుంచి కాపాడి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు, వేణుగోపాలస్వామి ఆలయ చైర్మన్ గుర్రం వెంకటేశ్వర్లు మంగళవారం తహసీల్దార్ బీవీ రమణారావుకు వినతిపత్రం అందజేశారు. శ్రీమదన వేణుగోపాలస్వామి, వరదరాజస్వామి, వల్లీ భుజంగేశ్వరస్వామి, అభయఆంజనేయస్వామి ఆలయాలకు వందల ఎకరాల్లో భూములు ఉన్నాయని, ఈ భూములు ఆక్రమణలకు గురవుతుండగా బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ దేవాదాయశాఖ జిల్లా అధికారి కె.జనార్దన్‌రెడ్డి ఆదేశాలతో తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినట్లు ఈఓ, చైర్మన్‌లు తెలిపారు. పామూరు పరిసర ప్రాంతాల్లో ఉండే ఆలయానికి చెందిన అర్చక, భజంత్రీ, దేవదాశి, మద్దెల భూముల వివరాలు రెవెన్యూ రికార్డుల్లో పరిశీలించి ఆన్‌లైన్‌లో ఆయా దేవాలయ స్వామి వారిపేరుపై భూములను ఆన్‌లైన్ చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికే గ్రామసభలు



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి ఉదయభాస్కర్

మర్రిపూడి: మండలంలో ఈ నెల 16వ తేదీ నుంచి సెప్టెంబర్ 30వ తేదీ వరకు రెవెన్యూ గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ప్రత్యేకాధికారి ఎ.ఉదయ భాస్కర్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రమైన మర్రిపూడి వెలుగు కార్యాలయంలో నిర్వహించిన అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సచివాలయ ఉద్యోగులు గ్రామ సభల సమయంలో సమగ్రమైన రికార్డులతో హాజరు కావాలని సూచించారు. ప్రధానంగా భూసమస్యలపై గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 22(ఏ) యాక్ట్ ప్రకారం గుర్తించిన నిషేధిత భూముల వివరాలను గ్రామసభల్లో ప్రజలకు తెలియపరచాలని చెప్పారు. సమస్యలపై అర్జీలిచ్చిన వారికి ఎండార్స్‌మెంట్ ఇవ్వాల్సిన బాధ్యత గ్రామస్థాయి అధికారులదేనన్నారు. తహసీల్దార్ జ్వాలా నరసింహారావు మాట్లాడుతూ.. గ్రామసభల సమాచారం ప్రజలకు తెలిసేలా దండోరా వేయించాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ భూపతి, అన్ని గ్రామాల వీఆర్వోలు, సర్వేయర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు

కొండారెడ్డిని పరామర్శించిన దద్దాల



కొండారెడ్డిని పరామర్శిస్తున్న దద్దాల నారాయణ

పీసీపల్లి: ఇటీవల బైక్ ప్రమాదంలో గాయపడిన బోడే కొండారెడ్డిని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణ మంగళవారం విజయవాడలోని ఆయన స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. కొండారెడ్డిది పీసీపల్లి మండలం నేరేడుపల్లి గ్రామం. ప్రమాదం జరిగిన వివరాలను, ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. దద్దాల మాట్లాడుతూ కొండారెడ్డి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈయన వెంట నాగిరెడ్డిపల్లి సర్పంచ్ సైకం స్వర్ణ ఏడుకొండలు తదితరులు ఉన్నారు.

దద్దాలను కలిసిన నేతలు

కనిగిరి రూరల్: వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్‌ను విజయవాడలో స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు మంగళవారం కలిశారు. విజయవాడకు చెందిన 25వ డివిజన్ కార్పొరేటర్ బంకా భాస్కర్ యాదవ్, 29 డివిజన్ కార్పొరేటర్ కొంగిటాల లక్ష్మీపతి ముదిరాజ్, 25వ డివిజన్ అధ్యక్షుడు చినబాబు, పార్టీ నాయకులు దద్దాలను మర్యాదపూర్వకంగా కలిశారు. నాగిరెడ్డిపల్లి సర్పంచ్ సైకం స్వర్ణ ఏడుకొండలు రెడ్డి తదితరులున్నారు.

అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలి



చెత్త సంపద కేంద్రాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ హనుమంతరావు

కనిగిరి రూరల్: పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు సమన్వయంతో పనిచేసి గ్రామాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని ఎంపీడీఓ ఎస్‌వీఎల్ హనుమంతరావు అన్నారు. శిక్షణలో భాగంగా మంగళవారం మండలంలోని ఏరువారిపల్లి ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ సందర్శన, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఘన, వ్యర్థ పదార్థాల ద్వారా వర్మి కంపోస్టు తయారీ, తడి చెత్త, పొడి చెత్త ప్రమాదకర చెత్తలను వేరు చేసే విధానం గురించి వివరించారు. ఈఓఆర్‌డీ అన్నమ్మ, సీనియర్ అసిస్టెంట్ రహమత్ బాషా, ఏఓ ఫ్రాన్సిస్‌బాబు, పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులు, గ్రీన్ అంబాసిడర్‌లు పాల్గొన్నారు. **హనుమంతునిపాడు:** సర్పంచులు, కార్యదర్శులు అభివృద్ధిపై దృష్టి సారించాలని ఎంపీడీఓ కె.లలిత అన్నారు. రెండో రోజు శిక్షణలో ఆమె మాట్లాడుతూ పంచాయతీలకు వచ్చే నిధులతో పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్ ఏర్పాటు చేయాలన్నారు. చెత్త నుంచి సంపద సృష్టించి వచ్చే నిధులతో పంచాయతీల అభివృద్ధికి ఖర్చు చేయాలన్నారు. అనంతరం కొండారెడ్డిపల్లి, కోటతిప్పల గ్రామాల్లో ఏర్పాటు చేసిన చెత్త కేంద్రాల వద్ద అవగాహన కల్పించారు. ఏఓ కేవీ క్రిష్ణారావు, ఈఓఆర్డీ షేక్ షరీఫ్ కార్యదర్శులు కొండయ్య, సంధ్యారాణి, రామ క్రిష్ణారెడ్డి, రమణయ్య పాల్గొన్నారు.

జాతీయ జెండాతో ర్యాలీ



జాతీయ జెండాతో విద్యార్థుల ర్యాలీ



టంగుటూరులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

పీసీపల్లి: హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా స్థానిక పెదయిర్లపాడు జిల్లా పరిషత్ విద్యార్థులు జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు అబ్దుల్ సుభాను, బీజేపీ నాయకులు శివరామిరెడ్డి, బలరామిరెడ్డి, రమణయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమరయోధులకు ఘన నివాళి

టంగుటూరు: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా మంగళవారం స్థానిక గ్రంథాలయంలో పింగళి వెంకయ్య, బళ్లారి రాఘవ చిత్ర పటాలకు ఘనంగా నివాళులర్పించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమాలను గ్రంథపాలకుడు వర్ధనరాజు పర్యవేక్షించారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు



వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులు



మహ్మదాపురంలో కబడ్డీలో తలపడుతున్న బాలికలు

హనుమంతునిపాడు: స్వాతంత్ర్య వేడుకలను పురస్కరించుకొని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రీడా పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. మంగళవారం కబడ్డీ, వాలీబాల్, క్రికెట్, క్విజ్, ఖోఖో, రింగ్‌బాల్, హై జంప్, లాంగ్ జంప్, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పోటీల్లో బాల బాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు స్వాతంత్ర్య దినోత్సవంలో బహుమతులు అందజేస్తామని హెచ్‌ఎం బీవీ సుబ్బారావు, శ్రీనివాసులు, పీడీ అరుణ్ తెలిపారు.

కూల్ డ్రింక్ దుకాణంలో చోరీ



నగదు ఉంచిన సొరుగును పక్కన పడేసిన దొంగలు

టంగుటూరు: కూల్ డ్రింక్ దుకాణంలో దొంగలు పడి నగదు చోరీ చేసిన సంఘటన టంగుటూరు సెంటర్లో ఆదివారం రాత్రి చోటుచేసుకోగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడు పాదర్తి చెంచురామయ్య కథనం మేరకు.. చెంబురామయ్య ఆదివారం రాత్రి 10 గంటలకు రూ.25 వేల నగదును ఏటీఎంలో డిపాజిట్ చేయబోగా అది పనిచేయలేదు. టంగుటూరు సెంటర్‌లోని తన దుకాణానికి వెళ్లి నగదును సొరుగులో ఉంచాడు. సోమవారం ఉదయం వచ్చి చూడగా దుకాణం వెనుక వైపు తలుపు తాళం పగలగొట్టి ఉంది. దుకాణంలో వస్తువులు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి, సొరుగులో ఉంచిన రూ.25 వేలు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా, దొంగలు కూల్ డ్రింక్ షాప్ పక్కనే ఉన్న దుకాణంలో చోరీకి విఫలయత్నం చేశారు. దుకాణానికి వేసిన నాలుగు తాళాల్లో రెండింటిని దొంగలు పగలగొట్టారు. పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

పొగాకు గరిష్ట ధర రూ.359

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రం పరిధిలో మంగళవారం నిర్వహించిన వేలంలో అత్యధిక ధర రూ.359 పలికింది. టంగుటూరు, సాదువారిపాలెం, జరుగుమల్లి, వావిలేటిపాడు గ్రామాలకు చెందిన రైతులు 1024 బేళ్లను వేలానికి తీసుకురాగా వాటిలో 934 బేళ్లను కొనుగోలు చేసి 90 బేళ్లను వ్యాపారులు తిరస్కరించారు. గరిష్ఠ ధర రూ.359, కనిష్ఠ ధర రూ. 205, సరాసరి రూ.315.09గా నమోదైంది. వేలంలో 45 మంది వ్యాపారులు పాల్గొన్నారని ఇన్‌చార్జి వేలం నిర్వహణాధికారి సిద్ధరాజు తెలిపారు.